ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 24 ఫిబ్రవరి 2025



పెన్నానదిలో రోడ్డు



పెన్నానదిలో రోడ్డు వేస్తున్న దృశ్యం

సిద్దవటం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కొత్తపల్లె వద్ద పెన్నానదిలో గొల్లపల్లె, వెంకటాయపల్లె, పొన్నోలు తదితర గ్రామాల ప్రజలు పెన్నానదిలో స్వచ్ఛందంగా మట్టి రోడ్డు వేసుకున్నారు. ఈ గ్రామాల ప్రజలు కడపకు వెళ్లాలంటే సిద్దవటం వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. దాదాపు 16 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లేవారు. ప్రస్తుతం పెన్నానదిలో నీరు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రూ.2 లక్షల ఖర్చు చేసి రోడ్డు వేసుకున్నారు. దీంతో వారికి కడపకు వెళ్లేందుకు 10 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

అట్టహాసంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



రాయచోటి వీరభద్రాలయంలో ధ్వజారోహణం సందర్భంగా కన్నడ భక్తుల వీరసాగి పూజలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య కృష్ణయ్య స్వాముల వేద మంత్రోచ్ఛారణల మధ్య మొదటిరోజు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా రాత్రి యాళి వాహనంపై వీరభద్రుడు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఇక్కడి నుంచి ఇసుక తరలించొద్దు

- ట్రాక్టర్లను అడ్డుకున్న ప్రజలు
- నీటి సమస్య తలెత్తుతుందని గ్రామస్థుల ఆందోళన



ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

వీరబల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మాండవ్యనది నుంచి ఇసుక తరలించొద్దని, ఇలాగే చేస్తే రాబోయే రోజుల్లో మాకు నీటి సమస్య వస్తుందని మండల ప్రజలు ఆదివారం ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు మాండవ్యనదిలోకి వెళ్లి ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, దీంతో తమ గ్రామంలో రానున్న వేసవి కాలంలో తాగు, సాగునీటి సమస్య ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే తమది కరువు ప్రాంతమని, ఇసుక రవాణా ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో నీటి కష్టాలు తప్పవని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్థులకు సర్దిచెప్పి ఇసుక ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించి వేశారు.



పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం

అక్రమార్జనకు కాదేదీ అనర్హం అని నిరూపించారు పీలేరు పంచాయతీ పాలకులు, సిబ్బంది. ఇంతవరకు కేవలం ప్రభుత్వం నుంచి వచ్చిన వివిధ గ్రాంట్లు, నిధులలోనే గోల్‌మాల్ జరిగిందని అందరూ భావిస్తుండగా ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల్లోనూ చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీలో మూడేళ్లలో జరిగిన ఇంటి ప్లాన్ అప్రూవల్స్ వ్యవహారంలో కోట్లాది రూపాయల గోల్‌మాల్ జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

ఇదో రకం మోసం...!

- ఇంటి ప్లాన్ అప్రూవల్స్‌లో చేతివాటం
- పీలేరు పంచాయతీలో వెలుగు చూసిన వైనం
- నోరెళ్లబెడుతున్న బాధితులు

పీలేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పీలేరులో పనిచేస్తున్న ఓ మండల స్థాయి అధికారి పీలేరులో ఇల్లు కట్టుకుంటున్నారు. గత ఏడాదిలో దాదాపు రూ.1.20 లక్షల ఫీజు చెల్లించి తన ఇంటికి పంచాయతీలో ప్లాన్ అప్రూవల్ పొందారు. ఆ ఇల్లు పూర్తి కావస్తుండడంతో దానికి పన్ను వేయమని నాలుగు రోజుల క్రితం పంచాయతీ కార్యాలయ సిబ్బందిని కలిశారు. ఆయన అందించిన ఇంటి ప్లాన్ నెంబరు ఆధారంగా వారు తమ వద్ద ఉన్న రికార్డులు పరిశీలించి రికార్డుల్లో ఆయన అందించిన నెంబరు ఇతరుల పేరిట ఉందని వారు ఆయనకు తెలిపారు. దీంతో ఆయనకు దిక్కుతోచలేదు. తన సమస్యను ఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి ప్లాన్ అప్రూవల్ సమయంలో తాను అప్పటి సర్పంచ్ కుటుంబీకులను సంప్రదించి వారి సూచన మేరకు డబ్బు చెల్లించానని, వారు తనకు ఇచ్చిన అప్రూవల్ పత్రాన్ని తన వద్ద పెట్టుకున్నానని, అది ఇప్పుడు చెల్లకుండాపోయిందని వాపోయారు.

● పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు మూడేళ్ల క్రితం ఇంటి ప్లాన్ ఆమోదం తీసుకుని ఏడాదిన్నర క్రితం ఇంటి పన్ను కూడా వేయించుకున్నారు. ఆ తరువాత తన ఇంటి వైపు పంచాయతీ బిల్ కలెక్టర్లు రాకపోవడంతో పన్ను చెల్లిద్దామని 20 రోజుల క్రితం పంచాయతీ కార్యాలయ సిబ్బందిని సంప్రదించారు. ఆయన అందించిన ఇంటి పన్ను రశీదు నెంబరు తమ రికార్డుల్లో మరో వ్యక్తి పేరిట ఉన్నట్లు వారు గుర్తించారు. అతనూ చేసేది లేక తన సమస్యను ఈవో దృష్టికి తీసుకెళ్లారు.

● పీలేరు పట్టణానికి చెందిన ఓ న్యాయవాది తన తల్లి పేరిట రెండేళ్ల క్రితం ఇంటి ప్లాన్ అప్రూవల్ తీసుకున్నారు. బ్యాంకు రుణం కోసం తిరుగుతున్నప్పుడు ఒరిజినల్ ప్లాన్ పత్రాలు పోగొట్టుకున్నాడు. బ్యాంకు సిబ్బంది సలహాతో తనకు తన ఇంటి ప్లాన్ పత్రాల జిరాక్స్ ప్రతులను అందించాలని పంచాయతీ కార్యాలయంలో సంప్రదించారు. ఆయన అందించిన నెంబరు కూడా ఇతరుల పేరుతో ఉందని సమాధానం రావడంతో ఆయనా అవాక్కయ్యారు. పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇటువంటి ఫిర్యాదులు సగటున వారానికి రెండు వస్తున్నాయని పంచాయతీ ఈవో వాపోతున్నారు. మూడేళ్లలో పంచాయతీలో సాగిన ఇష్టారాజ్య పరిపాలనకు నిదర్శనంగా ఇంటి ప్లాన్ అప్రూవల్స్ నిలుస్తున్నాయని, వాటిలో పెద్దఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని ఈవో తల పట్టుకుంటున్నారు.

ఆదాయ వనరుగా ఇంటి ప్లాన్ అప్రూవల్స్

పీలేరు గ్రామ పంచాయతీలో నూతన గృహ నిర్మాణాలు చేపట్టాలంటే పంచాయతీ అనుమతి తప్పనిసరి. తమ పేరిట ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి ప్లాన్‌తో పంచాయతీ అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారు ఫీజు నిర్ణయిస్తుంటారు. సగటున రూ.60 వేల దగ్గర నుంచి ఇంటి నిర్మాణ విస్తీర్ణాన్ని బట్టి రూ.లక్షల వరకు ఫీజు ఉంటుంది. సామాన్య ప్రజలు ముందుగా అధికారులను కాకుండా సర్పంచులను కలిసి అప్రూవల్ ఫీజు తగ్గించుకునే ప్రయత్నం చేస్తుంటారు. తమను సంప్రదించిన వారి ప్లాన్ ఫీజును తగ్గించుకోమని వారు సిబ్బందిని ఆదేశించడం పరిపాటి. ఇదే అంశాన్ని పీలేరు సర్పంచులు ఆదాయ మార్గంగా మలుచుకున్నారు.

తమను సంప్రదించిన వారి వద్ద నుంచి ఫీజు తగ్గించి తీసుకోవాలని అధికారులను ఆదేశించడమే కాకుండా వారు చెల్లించిన నగదును కూడా పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా సర్పంచులే తీసుకునే వారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ అవసరాలు తీరాకనో, లేక తమకు రావాల్సిన బిల్లులు వచ్చినప్పుడు ఆయా ఇంటి ప్లాన్ ఫీజులను సర్దుబాటు చేసేవారని తెలుస్తోంది. అయితే ఈ సర్దుబాటు సమయంలో అప్పట్లో పీలేరు పంచాయతీలో పనిచేసిన కొంత మంది సిబ్బంది కూడా చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్పంచులు, ఈవోలు కొంతకాలం ఆలస్యం చేయగా లేనిది, తాము చేస్తే తప్పా అన్నట్లు ఆ నగదును వారు తమ వ్యక్తిగత అవసరాల కోసం వాడుకున్నట్లు తెలిసింది. ఈలోపు నగదు చెల్లించిన వారు ఒత్తిడి చేస్తే సర్పంచు దగ్గర నుంచి సిబ్బంది వరకు ఏకతాటిపైకి వచ్చి అడిగిన వారికి ఏదో ఒక రశీదు ఇచ్చి పంపినట్లు అర్థం అవుతోంది. అలా రశీదులు అందుకున్న వారు ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో వాకబు చేస్తుంటే అవి చెల్లనవిగా నిర్ధారణ అవుతుండడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతానికి అలా 90 ప్లాన్‌ల వరకు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కాగా పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిన అధికారులు రూ.1.5 కోట్లు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించి ఇద్దరు సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేసి, ముగ్గురు ఈవోలను సస్పెండ్ చేయడం తెలిసిందే. అయితే విచారణకు వచ్చిన అధికారులు కేవలం ప్రభుత్వం నుంచి పంచాయతీకి మంజూరైన వివిధ గ్రాంటుల వినియోగంపై విచారణ జరిపారని, ప్రజల దగ్గర నుంచి ఇంటి ప్లాన్ అప్రూవల్స్, ఇంటి, కొళాయి పన్నులు వంటి వాటిపై ఎటువంటి విచారణ జరపలేదని ఇటీవల టీడీపీ నాయకులు ఆరోపించారు. ఆ రెండు అంశాల్లోనూ విచారణ జరిపితే మరో రూ.కోటి వరకు అవినీతి బయటపడుతుందని వారు తెలిపారు.

సారె.. తీసుకెళుతుండగా...

- అదుపు తప్పి బోల్తాపడిన టాటాఏస్
- నవ వధువు సహా 14 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం





ప్రమాదానికి గురైన టాటా ఏస్ వాహనం, ఇన్‌సెట్‌లో ప్రమాదంలో గాయపడిన వారు...

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సారె తీసుకెళుతుండగా టాటా ఎస్ బోల్తాపడి నవ వధూవరులతో పాటు 14 మంది గాయపడిన సంఘటన ఆదివారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం మోడల్ స్కూల్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... సుండుపల్లె మండలం రాచంవాండ్లపల్లెకు చెందిన నాగరాజుకు రాయచోటి మండలం మాధవరం గ్రామం కురవపల్లెకు చెందిన నందినితో మూడు నెలల క్రితం వివాహం జరగ్గా నవవధువు సారె... తీసుకుని టాటాఎస్‌లో బంధువులందరితో అత్తారింటికి బయలుదేరింది. ఆటోను వరుడు నాగరాజ నడుపుతుండగా రాయచోటి-సుండుపల్లె మార్గంలోని శిబ్యాల మోడల్ స్కూల్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నవదంపతులతో పాటు రామలక్ష్మమ్మ, కృష్ణయ్య, రంజిత్‌కుమార్, అనూష, గౌతమి, వెంకటేశ్వరి, జ్ఞాపిక, లక్ష్మీదేవి, శైలజ, రమేశ్, రెడ్డిరాణి, నరేశ్‌లు గాయపడ్డారు. వీరిలో రామలక్ష్మమ్మ, కృష్ణయ్య, రమేశ్, వెంకటేశ్వరిల పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంతో అక్కడ డాక్టర్లు ఎవరూ సమయానికి అందుబాటులో లేకపోవడం, కేవలం సిబ్బంది మాత్రమే వైద్య సేవలు అందించడంతో బాధితుల బంధువులు వైద్యులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనంతరం అక్కడికి చేరుకున్న ఐదుగురు వైద్యులు క్షతగాత్రులకు చికిత్స చేశారు. ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన సమయంలో రాయచోటి నుంచి శిబ్యాల వెళుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ప్రమాద సంఘటనపై ఆరా తీసి అంబులెన్స్‌కు ఫోన్ చేయడమే కాకుండా ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలింపజేశారు. విషయాన్ని తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిశ్చల్ నాగిరెడ్డి, మేనల్లుడు మౌర్యారెడ్డి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఈ మేరకు అర్బన్ పోలీసులు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇవన్నీ పుష్పల వాహనాలే...!



బాలపల్లె వద్ద కార్లలో అల్లుకున్న తీగలు

- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ...
- వాహనాలకు అల్లుకున్న తీగలు
- తుప్పుబట్టి.. ప్రభుత్వానికి రూ.కోట్లల్లో గండి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడిన పుష్పల వాహనాలు తుప్పుబట్టి.. తీగలు అల్లుకుని అక్కడున్నది అసలు ఏ వాహనమో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నాయి. కొన్నింటికి ఇంజన్లు, పలు భాగాలు మిగిలి ఉన్నాయో లేదో అనేది తెలియడం లేదు. మార్చి 5, 12, 19 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా 103 వాహనాలకు వేలం వేయనున్నారు. కేసుల పురోగతిలో తీవ్ర జాప్యంతోనే స్మగ్లింగ్‌లో పట్టుబడిన వాహనాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని పలువురు చెబుతున్నారు. బాలపల్లె, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, సానిపాయి, రాజంపేట, రాయచోటి, చిట్వేలి అటవీశాఖ రేంజిల పరిధిలో వాహనాలు చాలా ఉన్నాయి. అత్యధికంగా సానిపాయి, బాలపల్లె తదితర రేంజిల్లో కుప్పలు తెప్పలుగా వాహనాలు పడి ఉండడం, సుమారు పదేళ్ల నుంచి వేలం వేయకపోవడంతో తుప్పుబట్టి, ఆ వాహనాలు కనిపించకుండా మొక్కలు కూడా మొలిచాయి.

రూ.కోట్లల్లో ఆదాయానికి గండి

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల విషయంలో పురోగతి సాధించి ఉంటే పట్టుబడిన ఏడాదిలోనే వాహనాలను వేలం వేసే అవకాశాలు ఉండేది. ఇలా చేయగలిగి ఉండి ఉంటే ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వచ్చి ఉండేది. సుమారు పది సంవత్సరాల నుంచి వాహనాలు మూలనపడిపోవడంతో ఏ వాహనంలో ఏ పార్ట్ ఉందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ వాహనాలను పాత సామాన్ల వారు మాత్రమే కొనే పరిస్థితి ఉంది.

చేతివాటం

స్మగ్లింగ్‌లో పట్టుబడిన వాహనాల్లో ముఖ్యమైన విడి భాగాలు మాయమైపోతుండడంలో కొందరు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. ముందుగా మాయం అయ్యేది బ్యాటరీలు, వాటి స్థానంలో పనికిరాని బ్యాటరీలు ప్రత్యక్షమయ్యాయి. కొన్ని వాహనాలకు టైర్లు లేకుండాపోయాయి. వాహనాల్లో ఉన్న ముఖ్యమైన భాగాలు మాయం అయిపోతున్నాయంటే ఇంటి దొంగలే కారణమని చెప్పుకుంటున్నారు.

అన్ని వాహనాలకు వేలం వేస్తాం



ఏ ఒక్క వాహనాన్ని వదిలేయకుండా అన్నీ వేలంలో అమ్మేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తాం. ఒక పద్ధతి ప్రకారం వేలం పాట నిర్వహిస్తాము. తుప్పుపట్టిన వాహనాలను స్క్రాప్ (విడి భాగాల కింద) వేలం వేస్తాము. ఎర్రచందనం అక్రమ రవాణా విషయంలో ఎవరినీ వదిలేది లేదు. అటవీ ప్రాంతంలోకి వెళ్లాలంటే అనుమతి తప్పకుండా ఉండాలి. అనుమతి లేకుండా ప్రవేశించి అటవీ సంపదను స్మగ్లింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము.

-ఆర్.జగన్నాథ్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, రాజంపేట



పిచ్చి మొక్కలతో కప్పుకునిపోయిన వాహనాలు



వాహనాలు కనిపించకుండా ఉన్న దృశ్యం



పిచ్చి మొక్కల్లో కూరుకుపోయిన మోటారు బైకులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జలపాతాల నెలవు

ఏడు గుండాల కోన



7

ఇంటర్మీడియట్ పరీక్షలను

పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్మీడియట్ పరీక్షల సన్నాహక సమావేశంలో డీఐఈవో కృష్ణయ్య

7

జలపాతాల నెలవు ఏడు గుండాల కోన



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవులు, దూకే జలపాతాలు, గలగల పారే వంకలు.. ప్రకృతి అందాలకు నెలవు ఏడు గుండాల కోన. రైల్వేకోడూరు నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఈప్రాంతం ఉంది. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతుంది. రాజంపేట ఆర్టీసీ అధికారులు గుండాలకోనను సందర్శించి ఇప్పటికే మూడు బస్సులను ట్రయల్‌రన్ చేశారు. కోనలోనూ శివరాత్రి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి సోమవారం ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ఓబులవారిపల్లె మండలం వై.కోట ప్రాంతంలోని కొండకోనల్లో గిన్నిగుండం, పసుపుగుండం, బూడిగుండం, సమారాధనగుండం, అభిషేక గుండం, జలగండం, సంతర్పణ గుండం, మాదిగ గుండం అనే ఏడు గుండాలు ఉన్నాయి. ప్రతి కోనలోను జలపాతాలు దూకుతూ ఉంటాయి. గుండాలకోనలో నీలకంఠేశ్వరుడి ఆలయం ఉంది. తాళ్లపాక అన్నమ య్య కుమారుడు తాళ్లపాక తిరుమలయ్య గుండాలకోన క్షేత్రాన్ని సందర్శించి ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడ ఉన్న ఒక తెలుగు శాసనలో ఇది లిఖితమై ఉంది. శకవర్షంబులు 1456 అగునేంబుడు జేష్ఠ మఖ నాండు తాళ్లపాక తిరుమలయ్య గారు ఇక్కడికి ఏతెంచిరి. హనుమంతుని ప్రతిష్ఠ చేసిరి అనే అక్షరాలు ఉన్నాయి. ఆలయ పరిన రాల్లోనే ఇంకో శాసనం కూడా ఉంది. వెంకట గిరి రాజులు కూడా ఈ ఆలయాన్ని సందర్శించి పూజలు చేసేవారు. శివరాత్రికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ముందుగా వైకోట గ్రామ స్థు లు కలిసి కోనకు దారి సరిచేస్తారు. శివరాత్రి పర్వదినాన అటవీ, పోలీసుశాఖల అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. వేలాది మంది భక్తులు వచ్చి పూజలు చేస్తారు. అన్నదానాలు నిర్వహిస్తారు.



ఎండ్రకాయలకోన జలపాతం వద్ద భక్తులు (ఫైల్)

ఎండ్రకాయల కోన



ఆలయం వద్ద శివలింగం

చిట్వేలి మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఎండ్రకాయల కోన కూడా శివరాత్రికి భక్తులతో కిటకిటలాడుతుంది. ఇక్కడ తపస్సు చేసిన రంగనాయకస్వామి నగరిపాడులో 1710 లో అగ్ని సమాధి అయ్యాడని చెబుతారు. 1886-87 మధ్యలో ఈ కోనకు బ్రిటీష దొరలు కాలి మార్గం ఏర్పాటు చేయించారు. గతంలో గ్రామస్తులు కలసి చిన్న పాటి గదిని నిర్మించారు. రానురాను ఈ కోన అభివృద్ధి చెందుతోంది. ప్రజల విరాళాలతోకుని రూ. కోటి తో పలు పనులు చేశారు. కూటమి ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి, రోడ్డు కోసం రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆలయ కమిటీ ఛైర్మన్ రాజశేఖర్, ప్రధాన కర్త ఈశ్వరయ్యలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కలికిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె వెళ్లే జాతీయ రహదారిలో ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో కారు ఢీకొనడంతో చెరువుముందరపల్లెకు చెందిన మనికి శంకర (35) మృతి చెందాడు. రోడ్డు పక్కన వ్యర్థ పదార్థాలు సేకరిస్తున్న క్రమంలో వేగంగా వెళుతున్న వాహనం ఢీకొంది. ఇది గమనించిన స్థానికులు అతడిని వెంటనే కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే ఇంజనీరింగ్ కళాశాల బాలుర హాస్టల్ ఎదురుగా మూరేవాండ్ల పల్లె రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వాల్మీకిపురం మండలం జోగినాయనిపల్లెకు చెందిన జోగినాయన పెద్ద రెడ్డెప్ప (78) మృతి చెందినట్లు సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మృతి



వెంకటనారాయణ (ఫైల్)

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు మృతి చెందాడు. ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ రైతు కన్నుమూశాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన రైతు తలారి వెంకటనారాయణ (60) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య సుజాత, కుమారుడు చిక్రీ, కుమార్తె నందిని ఉన్నారు. ప్రస్తుతం రైతు వెంకటనారాయణ టమోటా పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పంటకు స్ప్రే చేసేందుకు మందులు తేవడానికి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనాన్ని వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంతో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో మహిళ అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఈనెల 15వ తేదీ జరిగిన హత్య కేసులో గని అరుణ అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం డీఎస్పీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కంభం శివరామిరెడ్డి చిలంకూరు గ్రామంలో గని అరుణతో రెండేళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఒక సంవత్సరం నుంచి అరుణ తన ఇంటి ఎదురుగా ఉన్న జగన్నాదం ఆదెన్నతో వివాహేతర సంబంధం ఉన్నట్లు శివరామిరెడ్డికి తెలియడంతో ఇద్దరిని మందలించాడు. ఇది మనసులో పెట్టుకొని పతకం ప్రకారం ఆయనను చంపాలని చిలంకూరులోని అరుణ ఇంటికి 15వ తేదీ రాత్రి పిలిపించుకున్నారు. ఇంటిలోకి రాగానే శివరామిరెడ్డిపై కళ్లలో కారం కొట్టి జగన్నాథం ఆదెన్న తాడుతో మెడకు గట్టిగా బిగించి చంపి మృతదేహాన్ని ఆటోలో తీసుకుపోయి తొండూరు మండలం మల్లెల ఘాట్‌లో పడేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎర్రగుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి అనుమానిత అరుణను అరెస్టు చేసి విచారించగా శివరామిరెడ్డి సెల్‌ఫోన్‌ను, చెప్పులను, అతని మెడకు వేసిన చంపి తాడును ఎవరికి తెలియకుండా ఉండాలని కాల్చి బూడిదను కాలువలో పడవేసినట్లు తెలిపిందన్నారు. మరో నిందితుడు ఆదెన్న పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

కుక్కల దాడిలో 53 గొర్రె పిల్లలు మృతి



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సి.గోపలాపురంలో కుక్కలదాడిలో 53 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు... గోపులాపురం గ్రామానికి చెందిన చల్లా సుబ్బయ్య, గొర్ల ఓబయ్య గొర్రెలను పాచికలపాడు గ్రామ పొలంలోకి మేత కోసం తోలుకెళ్లారు. గొర్రె పిల్లలకు మాత్రం కంచె ఏర్పాటు చేసి అక్కడే వదిలేసి వెళ్లగా.. కుక్కలు దాడి చేయడంతో దాదాపు 52 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దీంతో దాదాపు రూ.2లక్షలు నుంచి రూ.3లక్షలు నష్టపోయామని గొర్రెల కాపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా... డ్రైవరు మృతి



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్‌టీ వీపీ రోడ్డులో ఆదివారం ఉదయం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడ టంతో డ్రైవరు మృతి చెందాడు. మృతుడు ఆళ్లగడ్డకు చెందని గైబు (34)గా పోలీసులు గుర్తించారు. ఆర్‌టీవీపీలోని ప్లయాష్ కోసం వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసి కేసు నమోదు చేశారు.

అయోధ్యలో ఓబులవారిపల్లె వాసి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి): కువైట్ నుంచి ఇండియాకు వచ్చి మిత్రులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం మృతి చెందాడు. ఓబులవారిపల్లెకు చెందిన నూకా పాపుగారి సుధాకర్‌రెడ్డి(47) ఈనెల 20న కువైట్ నుంచి 20 మంది బృందంతో వచ్చి.. కుంభమేళాకు వెళ్లారు.

అక్కడి నుంచి అయోధ్యలో శ్రీరాముని దర్శనం కోసం ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. ఆ సమయంలో సుధాకర్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఆసుపత్రికి తీసుకెళ్లేక్రమంలో మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియడంతో విషాదఛాయలు అలముకున్నాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : ఆర్జేడీ రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ రవి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్జేడీ రవి పేర్కొన్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కడప నగరం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కస్టోడియన్ అడిషనల్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేది నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయని సూచించారు. ఇంటర్ బోర్డు సూచనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. జిల్లా కార్యాలయంలో పరీక్షలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, విద్యార్థుల తల్లిదండ్రులు ఏదైనా సమస్య ఉంటే 08562 244171 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. డీసీ సభ్యులు బి.వెంకటసుబ్బయ్య, రామిరెడ్డి, ఎన్.శివహరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో...

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని పరీక్షల నిర్వహణ అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయన్నారు. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా కేంద్రంలో ఇంటర్ బోర్డు ప్రధాన కేంద్రంలో నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు టాబ్లెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 అమలులో సెక్షన్ ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడ మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలను చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ప్రకాశ్, అమరేంద్ర కుమార్, నాగసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల నిప్పు... రైతన్నలకు తీవ్ర నష్టం

- చింతవారిపల్లె వద్ద రెండున్నర ఎకరాల ఉలవ పంట దగ్ధం
- కాలిపోయిన డ్రిప్ పైపులు, టమోటా కట్టెలు... రూ.2 లక్షల వరకు నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు పెట్టిన నిప్పు రైతన్నలకు తీవ్ర నష్టం చేకూర్చింది. గుట్టకు నిప్పు పెట్టడంతో మంటలు పొలాల వైపు మళ్లడంతో రెండున్నర ఎకరాల ఉలవ పంట, డ్రిప్, పీవీసీ పైపులు, టమోటా కట్టెలు, కొబ్బరి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ చింతావారిపల్లెకు సమీపంలో గుట్టకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. భారీగా మంటలు చెలరేగి గుట్టకు ఆనుకుని ఉన్న పొలాల వైపు మళ్లాయి. దీంతో రైతు హరినాథరెడ్డి సాగు చేసిన రెండున్నర ఎకరాల ఉలవ పంట పూర్తిగా కాలిపోయింది. పంట చేతికొచ్చే సమయంలో దగ్ధం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదే రైతుకు కొబ్బరి చెట్లు కూడా కాలిపోయాయి. మూడు వేల టమోటా కట్టెలు కాలిపోయాయి. రైతు సిద్దప్ప పొలంలో పీవీసీ పైపులు, డ్రిప్ పైపుల కట్టలు, వెంకటరమణ పొలంలో బోరు మోటారుకు అమర్చిన స్టార్టర్ పెట్టె, 2 వేల టమోటా కట్టెలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో నలుగురు రైతులకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేందుకు యత్నించారు. గుట్ట ప్రాంతం కావడంతో ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు వీలు కాలేదు. అతి కష్టం మీద సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలు మిగిలిన పొలాలకు వ్యాపించకుండా ఆర్పి వేశారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నులులో గాని, శ్రీశైలంలో గాని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు శ్రీశైలం పరిధిలోని ప్రాజెక్టులకు సంబంధించినదే అని రాయలసీమలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రజాఫిర్యాధుల స్వీకరణ

కడప కలెక్టరేట్‌తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు డయిల్ యువర్ కార్యక్రమంతో పాటు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు జరుగుతాయని డీఆర్వో ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, మండల, మున్సిపల్ కమిషనరు కార్యాలయాల్లో అర్జీలు సమర్పించాలని తెలిపారు.

జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా రమణారెడ్డి



వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (క్రూష్మా) అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో రెండవసారి ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రమణారెడ్డి తెలిపారు.

పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారు

- సోలార్‌కంపెనీ నిర్వాకంపై రైతులు ఆవేదన



పొలంలో పాతిన ఇనుప దిమ్మెలు చూపిస్తున్న రైతు శ్రీనివాసులు

పెద్దముడియం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ అనుమతి, అంగీకారం లేకుండా సోలార్ కంపెనీ మా పొలాల్లో పనులు చేపట్టిం దంటూ పలువురు రైతులు వాపోతున్నారు. పెద్దముడియం మండలం కల్వటాల గ్రామ పరిధిలో ఓ సోలారు కంపెనీ పలువురు రైతులకు చెందిన పంట పొలాలను లీజుకు తీసుకుని సోలార్‌ప్యానెల్‌ను అమర్చుతోంది. అయితే తమ ప్రమేయం లేకుండానే పొలంలో ఇనుప దిమ్మెలు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ సమస్యను పెద్దముడియం పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. కలవటాల గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు సర్వే నెం.661లో ఎకరా 50 సెంట్లు, సుబ్బరాయుడు అనే రైతుకు 662 సర్వేనెంబరులో 2 ఎకరాల 10 సెంట్లు పొలం ఉంది. అయితే అంగీకారం లేకుండానే సుబ్బరాయుడు పొలాన్ని చదను చేశారు. అలాగే శ్రీనివాసులు పొలంలో గోతులు తవ్వి సిమెంటు దిమ్మెలను కూడా ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని సోలార్ కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోగా పరిష్కారం చేస్తామంటూ చెప్పారే తప్ప ఇంత వరకు న్యాయం చేయలేదని బాధితులు వాపోయారు. ఈ విషయాన్ని పెద్దముడియం పోలీసుల దృష్టికి తీసుకుపోగా ఫిర్యాదు స్వీకరించారు. అయితే కంపెనీ ప్రతినిధులు రైతుల మధ్య చర్చలు జరుగుతుండడంతో పోలీసులు కూడా ఇంత వరకు కేసు నమోదు చేయలేదు. ఇప్పటికైనా కంపెనీ ప్రతినిధులు తమకు పరిహారం అందించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం



స్క్రాప్ గోడౌన్‌లో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కడప క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప నగరం భవానీనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు కిందపడి స్క్రాప్‌కు మంటలు అంటుకున్నాయి. ఆ పక్కనే ఉన్న బార్బర్ షాపులోకి కూడా మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు కడప ఫైర్ అధికారి బస్విరెడ్డి ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. భవానీ నగర్‌లో హరీస్‌ట్రేడర్స్ భవనం పక్కన స్క్రాప్ బిజినెస్ నిర్వహిస్తున్నారు. అయితే పైన రెండు విద్యుత్ తీగలు జాయింట్ కావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పురవ్వలు కింద పడి స్క్రాప్‌కు అంటుకోవడంతో మంటలు వ్యాపించి కాలిపోయింది. పక్కన పి.రామచంద్ర బార్బర్ షాపునకు మంటలు వ్యాపించడంతో.. దాదాపు లక్షా 50వేల మేర ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు గ్రామం దిన్నెమీదపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు ఆదివారం తెలిపారు. మండలంలోని నాయనబావి పంచాయతీ గుట్టపాళ్యంకు చెందిన రవీంద్రరెడ్డి తన కుమారుడైన యశ్విన్‌రెడ్డి (4)ని ద్విచక్ర వాహనంలో తీసుకుని వెళుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొని తండ్రీకొడుకులు గాయపడి మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈనెల 21న జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రవీంద్రరెడ్డి తండ్రి రెడ్డెప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైలపల్లెలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



చిట్వేలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలపల్లె చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. సాయంత్రం 5.30 గంటలకు వేద పారాయణం చేశారు. శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమం సోమవారం కల్యాణోత్సవం, గ్రామోత్సవంతో ముగుస్తుందని ఆలయ ధర్మకర్త వడ్డే శంకర్‌రెడ్డి తెలిపారు. ఆలయ పురోహితుడు రాయపెద్ది రాజశేఖర్‌శర్మ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్య కల్యాణం



సుబ్రమణ్యంస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

సిద్దవటం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుమ లోపల్లె సమీపాన వెల సిన శ్రీవల్లీ దేవసేన స మేత సుబ్రహ్మణ్య స్వా మి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సంద ర్భంగా ఆదివారం గ ణపతి పూజ, పంచామృతాభిషేకాలు, మంగళ హారతి, హోమం, కంకణధారణ, కల్యాణోత్సవం నిర్వహించారు. కడప, సిద్దవటం ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాలొన్నారు. ఆలయ అర్చకుడు వీరయ్య, ధర్మకర్త లక్ష్మయ్య, భక్తులు పాల్గొన్నారు.

పరివార దేవతా విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో కృష్ణమాచార్య గురూజీ

సిద్దవటం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సిద్దులు తపస్సు చేసిన సిద్దవటం పవిత్ర క్షేత్రమని పూజ్యశ్రీ కృష్ణమాచార్య గురూజీ అన్నారు. కనుమలోపల్లెలోని ఉమాదేవి సహిత నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సూర్యనారాయణస్వామి, పంచముఖ గణపతి, సుబ్రమణ్వేశ్వరస్వామి, పరివార దేవతా విగ్రహాలు ప్రతిష్ఠించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్నానది తీర ప్రాంతంలోని సిద్దవటం పవిత్ర మైన గ్రామంగా పేరు గడించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బాబు, ఆలయ అర్చకలు, భక్తులు పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకట్టుకుంటున్న..
మోటకట్ల శివాలయం

సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామంలోని కాశీ విశ్వేశ్వరాలయ నిర్మాణ శైలి పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఈ ఆలయం రహదారి పక్కనే ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఆలయంలో పూజలు నిర్వహించి మరీ వెళుతుంటారు.



మోటకట్ల శివాలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ, అంజనేయస్వామి విగ్రహాలు

సంబేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటకట్ల గ్రామ సమీపంలో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి పక్కన ఒకప్పుడు చిన్నపాటి అమ్మవారి ఆలయం ఉండేది. కాశీ యాత్రకు వెళ్లే క్రమంలో 1972లో ఈ ఆలయాన్ని సందర్శించిన కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ఇక్కడ కాశీ విశ్వేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు

స్థానికుల సాయంతో పీవీ సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ఆలయ ప్రాంగణంలో షిరిడీ సాయిబాబా, ఆంజనేయ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉపాలయాలు, కోనేరు నిర్మించారు. భక్తులకు అవసరమైన వసతులు కల్పించారు. ఆలయ ముందు భాగంలో ఏర్పాటు చేసిన 40 అడుగుల ఎత్తైన ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణుడి విగ్రహాలు, 20 అడుగుల ఎత్తుతో నిర్మించిన లింగాకార గోపురం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా మారాయి.



కంచి పీఠాధిపతి ప్రతిష్ఠించిన కాశీ విశ్వేశ్వర లింగం

ముమ్మరంగా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు

మహాశివరాత్రి సందర్భంగా ఈ ఆలయం వద్ద జాతర నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ వెంకటనాథరెడ్డి తన సోదరులతో కలసి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మార్చి 26న పూజలు, హోమాలు, శివపార్వతుల కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 27 తేదీ ఉదయం చాందినీ బండ్ల ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలుంటాయని వివరించారు. భక్తులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు



శివరాత్రికి ముస్తాబవుతున్న ఆదిభైరవస్వామి ఆలయం

గాలివీడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని గండి మడుగు, ఎగువగొట్టివీడు, నూలివీడు, పందికుంట, అరవీడు గ్రామాల్లోని శివాలయాలను సిద్ధం చేస్తున్నారు. దాదాపుగా అన్ని ఆలయాల్లో అన్నదానం చేయనున్నారు. చారిత్రకంగా ప్రసిద్ధిగాంచిన గండి మడుగు ఉమామహేశ్వర ఆలయం, పందికుంటలోని ఆదిభైరవ ఆలయంలో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

విశ్వహిందూ పరిషత్ కార్యాలయం ప్రారంభం



వీహెచ్‌పీ కార్యాలయాన్ని ప్రారంభించి పూజలు చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్ సమీపంలో ఆదివారం విశ్వహిందూపరిషత్ నూతన కార్యాలయాన్ని ప్రఖండ అధ్యక్షుడు దరిశా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పోకల ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పులపుత్తూరి రామసుబ్బారెడ్డి, విశ్వహిందూపరిషత్ విభాగ్ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, ప్రతినిధులు ఉమ్మలరాజు సురేష్‌రాజు, రెడ్డయ్యరాజు, సుగవాసి మల్లికార్జున, మణి, ఎల్లటూరి వెంకయ్యరాజు, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి మకర తోరణం



మకరతోరణం అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లెలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఇనమాల నర సింహులు, సుబ్బరత్నమ్మల జ్ఞాపకార్థం వారి మను మడు సునీల్‌కుమార్, మనుమరాలు సౌజన్య, కుటుంబ సభ్యులు కంచ శీనయ్య, నరసమ్మ, మడతల సుధాకర్ వెండి మకర తోరణం సమర్పించారు. ఆలయ ధర్మకర్త పంద్రా నరసింహులు ఆధ్వర్యంలో పూజలు నిర్వ హించారు. దాతలను ఆలయ ఆచారం ప్రకారం ఘనంగా సత్కరించారు.

జాతరకు ఏర్పాట్లు

పీలేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా తలపుల పంచాయతీ అడవిపల్లె వద్దనున్న మల్లేశ్వరస్వామి తిరునాళ నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. స్నానాలు ఆచరించే ఝరి ప్రదేశాలను ఆదివారం ఆయన పరిశీలించారు.

పారిశ్రామికవేత్త జీఎన్ నాయుడు యువతకు ఆదర్శం

● ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త రీజెన్సీ సిరామిక్ అధినేత జీఎన్ నాయుడును ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సూచించారు. ఆదివారం పట్టణంలో రీజెన్సీ నలందా విద్యాలయం నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజంపేట బస్టాండ్, మున్సిపల్ పార్కు ప్రాంతాల్లో చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో జన్మించిన డాక్టర్ జీన్ నాయుడు యానాం, పాండిచ్చేరి, ఒంగోలు ప్రాంతాల్లో సిరామిక్ సంస్థలను, విద్యాల యాలను ఏర్పాటు చేసి వేలాది మందికి జీవనోపాధి కల్పించారన్నారు. ఈ వయసులో కూడా ఆయన రాజంపేటలో పర్యావరణ పరిశుభ్రతకు ప్రాధాన్య మివ్వడం స్ఫూర్తిదాయకమన్నారు.

రీజెన్సీ సంస్థ తరఫున పలుచోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు డాక్టర్ జీఎన్‌నాయుడు ముందుకు రావడం హర్షణీయమ న్నారు. డాక్టర్ జీఎన్‌నాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ నిమిత్తం తాను ప్రారంభించిన ఈ కార్యక్రమానికి తొలివిడత కలెక్టర్ , రెండో విడత ఎస్పీ రావడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమాలను ముందుకు నడిపిస్తామన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చాలా ఉన్నత భావా లు కలిగిన వ్యక్తి అని, ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొనడం విద్యార్థులకు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి గోపాల్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, నలందా విద్యా సంస్థల సీఈవో గుడారు విజయ్ చందు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడారు సుబ్రమణ్యంనాయుడు, రైల్వేకోడూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మన్నూరు సీఐ మహ్మద్‌అలీ, పట్టణ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, నలందా విద్యా సంస్థల విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది తదితులు పాల్గొన్నారు.



క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పారిశ్రామికవేత్త జీఎన్ నాయుడు, విద్యార్థులు

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి సతీమణి హరిత , తనయుడు నిశ్చల్‌నాగిరెడ్డి

చిన్నమండెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిబండ గ్రామంలో సిమెంటు రోడ్డు పనులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, తనయుడు నిశ్చల్ నాగిరెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, వీధి లైట్లు, తదితర మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మవరం గ్రామానికి రక్షణ గోడ నిర్మించండి



బొమ్మవరం గ్రామం పక్కన ఉన్న చెరువు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) చెరువు అలుగు ప్రవాహం కారణంగా గ్రామానికి ముప్పు వాటిల్లకుండా రక్షణగోడ కట్టాలని బొమ్మవరం గ్రామానికి చెందిన సమీపంలో ఉన్న గ్రామానికి అలుగునీరు ప్రవహించే వైపు గ్రామానికి రక్షణ గోడ కట్టాలని టీడీపీ నాయకుడు ఉమ్మలరాజు సుబ్బరాజు కోరారు. గ్రామానికి ఇరువైపు లా చెరువు ఉండడంతో సమీపంలోనే అలుగు ప్రవహిస్తూ ఉంటుంది. గ్రామానికి, చెరువుకు సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ సచివాలయం ఉండడంతో పెద్దస్థాయి వర్షాలు వచ్చినపుడు గ్రామంలోకి నీరు వస్తుందని తెలిపారు. గ్రామం మధ్యలో నుంచి వెళుతున్న కాలువ ఎస్సీ కాలనీ సమీపంలో చెత్త, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమలవ్యాప్తి అధికమైందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులకు, గ్రామస్థులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నిరుపేద కుటుంబానికి 'మానవత' ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న మానవత సభ్యులు

చిట్వేలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గిరిజన యువకుడి కుటుంబానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు రూ. 10 వేల రూపాయల చెక్కును, సభ్యుడు సమ్మెట వీరాంజనేయరాజు రూ. 5 వేలు నగదును అందజేశారు. శ్రీసాయి వికాస్ పాఠశాలలో మృతుడి పిల్లలను చదివించేందుకు చర్యలు తీసుకుంటామని సంస్థ చైర్మన్ తిరుమల విశ్వనాథం ప్రకటించారు. మండలంలో పదో తరగతి చదువుతున్న 399 మంది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేసేందుకు సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మునిరావు, సాయిరాం, గౌరవ డైరెక్టర్ సభ్యులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, జాని తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలకు 50 కుర్చీలు విరాళంగా అందజేశారు. గురువులు నాగమల్లారెడ్డి, చెన్నమరాజు, ఈశ్వర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, రఘురామయ్య, షంషీర్‌ఖాన్ రత్నమ్మ, రఘునాథరెడ్డిని శాలువలు, గజమాలలతో సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు శివశంకర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి మాట్లాడారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గంగమ్మ జాతరకు గట్టి బందోబస్తు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గంగమ్మజాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. ఆదివారం గంగమ్మ జాతరలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆలయం లోపల బారికేడ్లను పరిశీలించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మంది పోలీసులను నియమించనున్నట్లు తెలిపారు. చాందినీ బండ్లు 10 అడుగుల కన్న ఎక్కువ ఎత్తు ఏర్పాటు చేయకూడదని, చాందినీ బండ్లు ఏర్పాటు చేసేవారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు .విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు వరప్రసాదు, కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర, ఈవో శ్రీనివాసులు,ఆలయ అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 24 నుంచి మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్, డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. సీఎస్ఈ. ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ లో ఆన్‌లైన్‌లో పరీక్ష రుసుము చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

12 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు అర్హులను ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 12 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. 35 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆపరేషన్లకు 12మందిని ఎంపిక చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 20 మందికి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూపగుప్త తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మానవత సభ్యులు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి మానవత సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. రాయదుర్గం వెంకటరమణ (60) అనే వృద్ధుడు భిక్షాటన చేసుకుంటూ, రాత్రి వేళల్లో రవీంద్ర నగర్ లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద నిద్రించేవాడు. రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను ఆదివారం మృతి చెందాడని స్థానికులు తెలిపారు ఎస్ఐ రవీంద్ర, ఏఎస్ఐ మస్తాన్ మృతదేహాన్ని పరిశీలించారు గ్రామ సర్పంచు ప్రభాకర్ రెడ్డి, వీఆర్‌ఓ పుష్పరాజు, మానవత సంస్థ మండల ప్రెసిడెంట్ డాక్టర్ షఫీ నాయక్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

సిద్దవటం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల కారణంగా వన్యప్రాణులకు ఎలాంటి నష్టం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యల కోసం ఆదివారం ఫారెస్టు అధికారులు కడప ఫారెస్టు రేంజి పరిధిలో సర్వే నిర్వహించారు. కోతల బ్రిడ్జి, శనీశ్వరగుడి, బాకరాపేట చర్చి వద్ద రోడ్డు కింద భాగంలో తూములు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ సర్వే నిమిత్తం మంగళవారం డిల్లీ నుంచి నిపుణులు రానున్నారని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో వినీత్‌కుమార్, అడిషనల్ డీఎఫ్‌వో స్వామివివేక్, కడప ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కీం బోరుకు నిప్పు

రామాపురం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె బీసీ కాలనీ తాగునీరు అందించే పథకా నికి సంబంధించిన వైర్లకు ఆదివారం రాత్రి దుండగు లు నిప్పంటించారు. విషయం గమనించిన స్థానికు లు సమాచారం అందించడంతో అగ్ని మాపక సిబ్బం ది వచ్చి మంటలు అదుపు చేశారు. మోటారు, స్టార్టరు , వైరు కాలిపోవడంతో నీటి సరఫరా కు అంతరాయం కలిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

చెరువులో పడి పెయింటర్ మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):చెరువులో పడి పెయింటర్ మృతి చెందినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. బెంగళూరు, మదనపల్లెల్లో పెయింటర్‌గా పని చేస్తున్న గాలివీడు మండలం, శెట్టివారిపల్లెకు చెందిన నాగరాజు (34) ఇంటికి వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మూడు రోజులైనా అతను రాకపోవడంతో తల్లి యశోద తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. మదనపల్లె మండలం, బసినికొండ వద్ద నక్కలకుంట చెరువులో ఆదివారం అతని మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జలపాతాల నెలవు ఏడు గుండాల కోన



ఆలయం పరిసర ప్రాంతంలో ఉన్న శాసనం

గుండాల కోనలోని బూడిద గుండం

గుండాలకోనలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి

పసుపు గుండం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అడవులు, దూకే జలపాతాలు, గలగల పారే వంకలు.. ప్రకృతి అందాలకు నెలవు ఏడు గుండాల కోన. రైల్వేకోడూరు నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఈప్రాంతం ఉంది. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతుంది. రాజంపేట ఆర్టీసీ అధికారులు గుండాలకోనను సందర్శించి ఇప్పటికే మూడు బస్సులను ట్రయల్‌రన్ చేశారు. కోనలోనూ శివరాత్రి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి సోమవారం ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి.

ఓబులవారిపల్లె మండలం వైకోట ప్రాంతంలోని కొండకోనల్లో గిన్నిగుండం, పసుపుగుండం, బూడిగుండం, సమారాధనగుండం, అభిషేక గుండం, జలగుండం, సంతర్పణ గుండం, మాదిగ గుండం అనే ఏడు గుండాలు ఉన్నాయి. ప్రతి కోనలోను జలపాతాలు దూకుతూ ఉంటాయి. గుండాలకోనలో నీలకంఠేశ్వరుడి ఆలయం ఉంది. తాళ్లపాక అన్నమ య్య కుమారుడు తాళ్లపాక తిరుమలయ్య గుండాలకోన క్షేత్రాన్ని సందర్శించి ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. ఇక్కడ ఉన్న ఒక తెలుగు శాసనలో ఇది లిఖితమై ఉంది. శకవర్షంబులు 1456 అగునేంబుడు జేష్ఠ మఖ నాండు తాళ్లపాక తిరుమలయ్య గారు ఇక్కడికి ఏతేంచిరి. హనుమంతుని ప్రతిష్ఠ చేసిరి అనే అక్షరాలు ఉన్నాయి. ఆలయ పరిస రాల్లోనే ఇంకో శాసనం కూడా ఉంది. వెంకట గిరి రాజులు కూడా ఈ ఆలయాన్ని సందర్శించి పూజలు చేసేవారు. శివరాత్రికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. ముందుగా వైకోట గ్రామ స్థు లు కలిసి కోనకు దారి సరిచేస్తారు. శివరాత్రి పర్వదినాన అటవీ, పోలీసుశాఖల అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. వేలాది మంది భక్తులు వచ్చి పూజలు చేస్తారు. అన్నదానాలు నిర్వహిస్తారు.



ఎంద్రకాయలకోన జలపాతం వద్ద భక్తులు (ఫైల్)

ఎంద్రకాయల కోన



ఆలయం వద్ద శివలింగం

చిట్వేలి మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఎంద్రకాయల కోన కూడా శివరాత్రికి భక్తులతో కిటకిటలాడుతుంది. ఇక్కడ తపస్సు చేసిన రంగనాయకస్వామి నగరిపాడులో 1710 లో అగ్ని సమాధి అయ్యాడని చెబుతారు. 1886-87 మధ్యలో ఈ కోనకు బ్రిటీష దొరలు కాలి మార్గం ఏర్పాటు చేయించారు. గతంలో గ్రామస్తులు కలసి చిన్న పాటి గదిని నిర్మించారు. రానురాను ఈ కోన అభివృద్ధి చెందుతోంది. ప్రజల విరాళాలతోకుని రూ. కోటి తో పలు పనులు చేశారు. కూటమి ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి, రోడ్డు కోసం రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేసిందని ఆలయ కమిటీ ఛైర్మన్ రాజశేఖర్, ప్రధాన కర్త ఈశ్వరయ్యలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

కలికిరి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె వెళ్లే జాతీయ రహదారిలో ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో కారు ఢీకొనడంతో చెరువుముందరపల్లెకు చెందిన మనికి శంకర (35) మృతి చెందాడు. రోడ్డు పక్కన వ్యర్థ పదార్థాలు సేకరిస్తున్న క్రమంలో వేగంగా వెళుతున్న వాహనం ఢీకొంది. ఇది గమనించిన స్థానికులు అతడిని వెంటనే కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే ఇంజనీరింగ్ కళాశాల బాలుర హాస్టల్ ఎదురుగా మూరేవాండ్ల పల్లె రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వాల్మీకిపురం మండలం జోగినాయనిపల్లెకు చెందిన జోగినాయన పెద్ద రెడ్డెప్ప (78) మృతి చెందినట్లు సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మృతి



వెంకటనారాయణ (ఫైల్)

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు మృతి చెందాడు. ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో చికిత్స పొందుతూ రైతు కన్నుమూశాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన రైతు తలారి వెంకటనారాయణ (60) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య సుజాత, కుమారుడు చిక్రీ, కుమార్తె నందిని ఉన్నారు. ప్రస్తుతం రైతు వెంకటనారాయణ టమోటా పంట సాగు చేశాడు. ఈ క్రమంలో పంటకు స్ప్రే చేసేందుకు మందులు తేవడానికి ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద ద్విచక్రవాహనాన్ని వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంతో రైతు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో మహిళ అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఈనెల 15వ తేదీ జరిగిన హత్య కేసులో గని అరుణ అనే మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం డీఎస్పీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కంభం శివరామిరెడ్డి చిలంకూరు గ్రామంలో గని అరుణతో రెండేళ్ల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఒక సంవత్సరం నుంచి అరుణ తన ఇంటి ఎదురుగా ఉన్న జగన్నాదం ఆదెన్నతో వివాహేతర సంబంధం ఉన్నట్లు శివరామిరెడ్డికి తెలియడంతో ఇద్దరిని మందలించాడు. ఇది మనసులో పెట్టుకొని పతకం ప్రకారం ఆయనను చంపాలని చిలంకూరులోని అరుణ ఇంటికి 15వ తేదీ రాత్రి పిలిపించుకున్నారు. ఇంటిలోకి రాగానే శివరామిరెడ్డిపై కళ్లలో కారం కొట్టి జగన్నాథం ఆదెన్న తాడుతో మెడకు గట్టిగా బిగించి చంపి మృతదేహాన్ని ఆటోలో తీసుకుపోయి తొండూరు మండలం మల్లెల ఘాట్‌లో పడేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎర్రగుంట్ల పోలీసులు కేసు నమోదు చేసి అనుమానిత అరుణను అరెస్టు చేసి విచారించగా శివరామిరెడ్డి సెల్‌ఫోన్‌ను, చెప్పులను, అతని మెడకు వేసిన చంపి తాడును ఎవరికి తెలియకుండా ఉండాలని కాల్చి బూడిదను కాలువలో పడవేసినట్లు తెలిపిందన్నారు. మరో నిందితుడు ఆదెన్న పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

కుక్కల దాడిలో 53 గొర్రె పిల్లలు మృతి



కమలాపురం రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సి.గోపలాపురంలో కుక్కలదాడిలో 53 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు... గోపులాపురం గ్రామానికి చెందిన చల్లా సుబ్బయ్య, గొర్ల ఓబయ్య గొర్రెలను పాచికలపాడు గ్రామ పొలంలోకి మేత కోసం తోలుకెళ్లారు. గొర్రె పిల్లలకు మాత్రం కంచె ఏర్పాటు చేసి అక్కడే వదిలేసి వెళ్లగా.. కుక్కలు దాడి చేయడంతో దాదాపు 52 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దీంతో దాదాపు రూ.2లక్షలు నుంచి రూ.3లక్షలు నష్టపోయామని గొర్రెల కాపర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా... డ్రైవరు మృతి



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం ఆర్‌టీ పీపీ రోడ్డులో ఆదివారం ఉదయం ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడ టంతో డ్రైవరు మృతి చెందాడు. మృతుడు ఆళ్లగడ్డకు చెందని గైబు (34)గా పోలీసులు గుర్తించారు. ఆర్‌టీపీపీలోని ప్లయాష్ కోసం వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసి కేసు నమోదు చేశారు.

అయోధ్యలో ఓబులవారిపల్లె వాసి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్ర జ్యోతి): కువైట్ నుంచి ఇండియాకు వచ్చి మిత్రులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం మృతి చెందాడు. ఓబులవారిపల్లెకు చెందిన నూకా పాపుగారి సుధాకర్‌రెడ్డి(47) ఈనెల 20న కువైట్ నుంచి 20 మంది బృందంతో వచ్చి.. కుంభమేళాకు వెళ్లారు.

అక్కడి నుంచి అయోధ్యలో శ్రీరాముని దర్శనం కోసం ఆదివారం మధ్యాహ్నం వెళ్లారు. ఆ సమయంలో సుధాకర్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఆసుపత్రికి తీసుకెళ్లేక్రమంలో మృతి చెందాడు. ఈ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియడంతో విషాదఛాయలు అలముకున్నాయి.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : ఆర్జేడీ రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ రవి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్జేడీ రవి పేర్కొన్నారు. ఏమాత్రం అలసత్వం వహించినా క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కడప నగరం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు కస్టోడియన్ అడిషనల్ సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేది నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయని సూచించారు. ఇంటర్ బోర్డు సూచనలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించి, జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. జిల్లా కార్యాలయంలో పరీక్షలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, విద్యార్థుల తల్లిదండ్రులు ఏదైనా సమస్య ఉంటే 08562 244171 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు. డీసీ సభ్యులు బి.వెంకటసుబ్బయ్య, రామిరెడ్డి, ఎన్.శివ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో...

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిధిలోని పరీక్షల నిర్వహణ అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయన్నారు. లైవ్ స్ట్రీమింగ్ ద్వారా జిల్లా కేంద్రంలో ఇంటర్ బోర్డు ప్రధాన కేంద్రంలో నిరంతరం పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో గాలి, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు టాబ్లెట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 అమలులో సెక్షన్ ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడ మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలను చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్స్ ప్రకాశ్, అమరేంద్ర కుమార్, నాగసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల నిప్పు... రైతన్నలకు తీవ్ర నష్టం

- చింతవారిపల్లె వద్ద రెండున్నర ఎకరాల ఉలవ పంట దగ్ధం
- కాలిపోయిన డ్రిప్ పైపులు, టమోటా కట్టెలు... రూ.2 లక్షల వరకు నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు పెట్టిన నిప్పు రైతన్నలకు తీవ్ర నష్టం చేకూర్చింది. గుట్టకు నిప్పు పెట్టడంతో మంటలు పొలాల వైపు మళ్లడంతో రెండున్నర ఎకరాల ఉలవ పంట, డ్రిప్, పీవీసీ పైపులు, టమోటా కట్టెలు, కొబ్బరి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్థుల కథనం మేరకు... మండలంలోని సోంపల్లె పంచాయతీ చింతావారిపల్లెకు సమీపంలో గుట్టకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. భారీగా మంటలు చెలరేగి గుట్టకు ఆనుకుని ఉన్న పొలాల వైపు మళ్లాయి. దీంతో రైతు హరినాథరెడ్డి సాగు చేసిన రెండున్నర ఎకరాల ఉలవ పంట పూర్తిగా కాలిపోయింది. పంట చేతికొచ్చే సమయంలో దగ్ధం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదే రైతుకు కొబ్బరి చెట్లు కూడా కాలిపోయాయి. మూడు వేల టమోటా కట్టెలు కాలిపోయాయి. రైతు సిద్దప్ప పొలంలో పీవీసీ పైపులు, డ్రిప్ పైపుల కట్టలు, వెంకటరమణ పొలంలో బోరు మోటారుకు అమర్చిన స్టార్టర్ పెట్టె, 2 వేల టమోటా కట్టెలు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో నలుగురు రైతులకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేందుకు యత్నించారు. గుట్ట ప్రాంతం కావడంతో ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు వీలు కాలేదు. అతి కష్టం మీద సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలు మిగిలిన పొలాలకు వ్యాపించకుండా ఆర్పి వేశారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నులులో గాని, శ్రీశైలంలో గాని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డు శ్రీశైలం పరిధిలోని ప్రాజెక్టులకు సంబంధించినదే అని రాయలసీమలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ప్రజాఫిర్యాధుల స్వీకరణ

కడప కలెక్టరేట్‌తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు డయిల్ యువర్ కార్యక్రమంతో పాటు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాలు జరుగుతాయని డీఆర్వో ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలు, మండల, మున్సిపల్ కమిషనరు కార్యాలయాల్లో అర్జీలు సమర్పించాలని తెలిపారు.

జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడిగా రమణారెడ్డి



వేంపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (క్రూస్మా) అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన ఉషాకిరణ్ హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో రెండవసారి ఆయన్ను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రమణారెడ్డి తెలిపారు.

పరిహారం ఇవ్వకుండా పనులు చేస్తున్నారు

- సోలార్‌కంపెనీ నిర్వాకంపై రైతులు ఆవేదన

పొలంలో పాతిన ఇనుప దిమ్మెలు చూపిస్తున్న రైతు శ్రీనివాసులు



పెద్దముడియం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తమ అనుమతి, అంగీకారం లేకుండా సోలార్ కంపెనీ మా పొలాల్లో పనులు చేపట్టిం దంటూ పలువురు రైతులు వాపోతున్నారు. పెద్దముడియం మండలం కల్వటాల గ్రామ పరిధిలో ఓ సోలారు కంపెనీ పలువురు రైతులకు చెందిన పంట పొలాలను లీజుకు తీసుకుని సోలార్‌ప్యానెల్‌ను అమర్చుతోంది. అయితే తమ ప్రమేయం లేకుండానే పొలంలో ఇనుప దిమ్మెలు ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తూ సమస్యను పెద్దముడియం పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. కలవటాల గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు సర్వే నెం.661లో ఎకరా 50 సెంట్లు, సుబ్బరాయుడు అనే రైతుకు 662 సర్వేనెంబరులో 2 ఎకరాల 10 సెంట్లు పొలం ఉంది. అయితే అంగీకారం లేకుండానే సుబ్బరాయుడు పొలాన్ని చదను చేశారు. అలాగే శ్రీనివాసులు పొలంలో గోతులు తవ్వి సిమెంటు దిమ్మెలను కూడా ఇటీవల ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని సోలార్ కంపెనీ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోగా పరిష్కారం చేస్తామంటూ చెప్పారే తప్ప ఇంత వరకు న్యాయం చేయలేదని బాధితులు వాపోయారు. ఈ విషయాన్ని పెద్దముడియం పోలీసుల దృష్టికి తీసుకుపోగా ఫిర్యాదు స్వీకరించారు. అయితే కంపెనీ ప్రతినిధులు రైతుల మధ్య చర్చలు జరుగుతుండడంతో పోలీసులు కూడా ఇంత వరకు కేసు నమోదు చేయలేదు. ఇప్పటికైనా కంపెనీ ప్రతినిధులు తమకు పరిహారం అందించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

బి.కొత్తకోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు గ్రామం దిన్నెమీదపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసినట్టు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు ఆదివారం తెలిపారు. మండలంలోని నాయనబావి పంచాయతీ గుట్టపాళ్యంకు చెందిన రవీంద్రరెడ్డి తన కుమారుడైన యశ్విన్‌రెడ్డి (4)ని ద్విచక్ర వాహనంలో తీసుకుని వెళుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొని తండ్రీకొడుకులు గాయపడి మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈనెల 21న జరిగిన ఈ సంఘటనకు సంబంధించి రవీంద్రరెడ్డి తండ్రి రెడ్డెప్పరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి మృతిపై..

పీలేరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలి మృతిపై కేసు నమోదు చేసినట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. ఆయన కథనం మేరకు పీలేరు మండలం రేగళ్లు పంచాయతీ యల్లంపల్లెకు చెందిన మునిబాయమ్మ(70) అస్వస్థతకు గురవడంతో ఆదివారం ఉదయం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందతూ ఆమె మృతి చెందింది. మునిబాయమ్మ కుమారుడైన చెంగల్రాయుడికి పార్వతి, జగదీశ్వరి ఇద్దరు భార్యలు. చిన్నకోడలైన జగదీశ్వరితో గొడవల నేపథ్యంలో ఆమె అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిందని, ఆమె మృతిపై తనకు అనుమానాలు ఉన్నాయని పెద్ద కోడలు పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

స్కీం బోరుకు నిప్పు

రామాపురం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె బీసీ కాలనీ తాగునీరు అందించే పథకానికి సంబంధించిన వైర్లకు ఆదివారం రాత్రి దుండగు లు నిప్పంటించారు. విషయం గమనించిన స్థానికు లు సమాచారం అందించడంతో అగ్ని మాపక సిబ్బం ది వచ్చి మంటలు అదుపు చేశారు. మోటారు, స్టార్టరు , వైరు కాలిపోవడంతో నీటి సరఫరా కు అంతరాయం కలిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

శివరాత్రికి శైవక్షేత్రాలు సిద్ధం

మహాశివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. మూడు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. భక్తుల శివరాత్రి జాగరణ, భద్రతపై పోలీసు అధికారులు పరిశీలిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ములకలచెరువు కనుగొండరాయస్వామి ఆలయం, నిమ్మనపల్లి నేలమల్లేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్నాయి.

- కనుల పండువగా శివరాత్రి ఉత్సవాలు
- కనుగొండరాయస్వామి ఆలయంలో ఏర్పాట్లు ముమ్మరం
- నేలమల్లేశ్వరాలయంలో సీఐ పరిశీలన



నేలమల్లేశ్వర ఆలయంలో..

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే బోళాశంకరుడిగా నేలమల్లేశ్వరస్వామిని కొలుస్తుంటారు. మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో బాహుదా నది ఒడ్డున కనుమగుండ్ల దగ్గర వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబవుతోంది. ఇక్కడ స్వామివారు స్వయంభు లింగముగా వెలిచారని ప్రసిద్ధి. 300వందల ఏళ్ల క్రితం తవళం గ్రామం నాయునివారిపల్లిలో పాలెగాండ్లు ఉండేవారు. వెంకటాచలపతి నాయుడు, లక్ష్మీదేవమ్మ దంపతులు వుండేవారు. వీరికి పశుసంపద ఎక్కువగా వుండడం వలన ఆవులు మేపేందుకు రామయ్యను కాపరిగా పెట్టుకొన్నారు. ప్రస్తుతం ఆలయం వున్నచోట కొలనుతో పాటు మహావృక్షంతో కూడిన దట్టమైన మల్లెపొదలు వుండేవి. ఆవులు నీరు తాగేందుకు కొలను వద్దకు వచ్చేవి. ఓ ఆవు మల్లెపొదలలో వున్న పుట్టలో బాలశంకరుడికి పాలు ఇస్తుండేది. ఈ విషయాన్ని వెంకటాచలపతి నాయుడుతో పాటు గ్రామస్తులకు చెప్పగా అక్కడ పుట్టను తవ్వారు. దేదీప్యమానంగా ప్రకాశిస్తూ శివలింగం కనిపిచింది. భూమి నుండి వెలసినందున యోగ నేల అని, మల్లెపొదల నుండి బయటపడినందున మల్లేశ్వరుడు అని ప్రజలు యోగ నేలమల్లేశ్వరస్వామిగా పిలుస్తుంటారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రస్తుతం దేవదాయశాఖ దాదాపు రూ.3కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన సీఐ

నేలమల్లేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం మదనపల్లి సీఐ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రికి ఆలయానికి వచ్చే భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. దొంగల పట్ల అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా మదనపల్లి-2డిపో మేనేజర్ అమరనాథ్ మాట్లాడుతూ ఈనెల 26, 27వ తేదీలలో 13బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిప్పేస్వామి, ఆలయ పూజారి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అడవిపల్లె జాతరకు పటిష్ట ఏర్పాట్లు

పీలేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పీలేరు మండలం తలపుల పంచాయతీ అడవిపల్లె వద్దనున్న మద్దుండాల మల్లేశ్వరస్వామి తిరుణాళ్ల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. మద్దుండాల ఆలయంతో పాటు భక్తులు స్నానాలు చేసే ప్రదేశాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కనుగొండరాయస్వామి ఆలయంలో..

ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలోని కనుగొండ రిజర్వు ఫారెస్టులో 16వ శతాబ్దంలో విజయనగర రాజులు నిర్మించిన కనుగొండరాయస్వామి ఆలయం ఉంది. చక్రవర్తి సదాశివరాయలు కోరిక మేరకు సామంతరాజు ఈ ఆలయాన్ని నిర్మించారు. భక్తుల కోరికలు తీర్చే దైవంగా కనుగొండరాయస్వామి పూజలందుకుంటున్నాడు. స్వామిని దర్శించుకోవాలంటే 120మెట్లు ఎక్కాలి. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. శివరాత్రి రోజున బ్యాంకు లాకర్‌లో దాచిన స్వామివారి బంగారు విగ్రహాన్ని ఆలయానికి తీసుకొచ్చి అభిషేకం, ప్రత్యేక పూజలు చేస్తారు. నిర్వాహకులు శివరాత్రి జాగరణకు, అన్నదాన నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.



మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

తంబళ్లపల్లె/ములకలచెరువు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె, ములకలచెరువు మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు హేమంత్ కుమార్, కవిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా మోడల్ స్కూళ్లలో ఏప్రిల్ 20వ తేదీన తెలుగు, ఇంగ్లీషు మీడియంలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుమును ఈనెల 24వ తేదీ నుంచి మార్చి 31లోగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు. అర్హత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఆయాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

పీలేరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఆయాల జిల్లా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం పీలేరులో జరిగింది. జిల్లా అధ్యక్షురాలిగా విమల, ప్రధాన కార్యదర్శిగా యశోద, ఉపాధ్యక్షురాళ్లుగా హసీనా, వెంకటరత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా నేత్రావతి, రామలక్ష్మమ్మ, నూర్జహాన్, కోశాధికారిగా లోకేశ్, సలహాదారులుగా నరసింహులు, వేణుగోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు.

ఎడిఫై స్కూల్‌ను ప్రారంభిస్తున్న పురప్రముఖులు



ఉత్తమ విద్యాబోధనలతో ఎడిఫై స్కూల్ ప్రారంభం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంతంలో ఉత్తమ విద్యాబోధనలు అందించేందుకు ఎడిఫై స్కూల్‌ను ప్రారంభించినట్లు ఆ స్కూల్ డైరెక్టర్ ఘర్ అగర్వాల్ పేర్కొన్నారు. ఆదివారం మాచిరెడ్డిగారిపల్లె వద్ద విశాలమైన స్థలంలో ఏర్పాటు చేసిన ఎడిఫై స్కూల్‌ను డాక్టర్ గోపీకృష్ణ, బీటీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ తులసీరామ్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా అగర్వాల్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు బోధనలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రమేశ్‌నాయుడు, హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ సుష్మానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా ఏఎస్ఆర్ సిల్క్స్ ప్రారంభం



సిల్క్స్‌ను ప్రారంభిస్తున్న దివ్యానందగిరిస్వామి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఎస్ఆర్ సిల్క్స్‌ను ఆదివారం తొగటవీర క్షత్రీయ సంఘం కులపెద్ద దివ్యానందగిరిస్వామి ప్రారంభించారు. శీలం రమేష్‌బాబు, రమణమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏఎస్ఆర్ సిల్క్స్ టెక్స్‌టైల్స్‌ను పట్టణప్రముఖుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రీయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించిన దగ్గుబాటి



కలకడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు తన కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఆహ్వానించారు. దగ్గుబాటి కుమార్తె హర్షిణి, రామకృష్ణల వివాహం మార్చి 9వ తేదీన ఆదివారం రాయచోటిలో జరగనుంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో ఓ కార్యక్రమానికి హాజరైన సీఎంను దగ్గుబాటి, ఆయన కుమారుడు పునీత్‌చౌదరి కలిసి వివాహానికి ఆహ్వానించారు.

సుప్రజ టెక్నాలజీస్‌తో మిట్స్ ఎంఓయూ ఒప్పందం

కురబలకోట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విజయవాడకు చెందిన సుప్రజ టెక్నాలజీస్‌తో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలలో సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఐటీ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం, కోడింగ్ సామర్థ్యాలను మెరుగు పరచుకోవడం తదితర వాటికి సంబంధించి సలహాలు, సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే కళాశాల విద్యార్థులు ప్రాజెక్ట్‌లు, పరిశోధనలు చేపట్టనున్నారని, దీంతో విద్యార్థులకు మరింతగా ఉద్యోగావకాశాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మధురసన్ తదితరులు పాల్గొన్నారు.



సుప్రజ టెక్నాలజీస్‌తో ఎంఓయూ ఒప్పందం కుదుర్చుకుంటున్న కళాశాల విభాగాధిపతి గీతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్

'సింహగర్జన'ను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 23వ తేదీన చేపట్టిన 'రాయలసీమ మాలల సింహగర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీలేరు మాలమహానాడు నాయకులు పిలుపునిచ్చారు. పీలేరు పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఆదివారం వారు సింహగర్జన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఆ తీర్పు ద్వారా క్రీమీలేయర్ అంటూ రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు. వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన వన్ మ్యాన్ కమిషన్‌ను సైతం రద్దు చేయాలన్నారు. రిజర్వేషన్లు పెంచడమే కాకుండా బ్యాక్‌లాగ్ పోస్టులు, కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మార్చి 23న తిరుపతిలో సింహగర్జన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మాలలు, మేధావులు, అంబేడ్కర్ వాదులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు సుభాష్, లక్ష్మీనారాయణ, తుమ్మల ధరణీకుమార్, ఆనంద్, ద్వారక, పురుషోత్తం, దామోదరం, రాజేంద్రబాబు, రవిబాబు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్తారా.. రాజీనామా చేస్తారా..?

- వైసీపీ ఎమ్మెల్యేలకు జనసేన మహేష్ ప్రశ్న



మీడియాతో మాట్లాడుతున్న మైఫోర్స్ మహేష్

మదనపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికైన వైసీపీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నేటి నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని, లేకుంటే రాజీనామా చేయాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లని పక్షంలో వారి ఇళ్లను ముట్టడించైనా రాజీనామా చేసే వరకూ జనసేన వదిలిపెట్టదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు తమ కర్తవ్యాన్ని మరచి అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆయన వాపోయారు. సోమ, మంగళవారాల్లో ఆ ముగ్గురు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకుంటే బుధవారం జనసైనికులతో వారి ఇళ్లను ముట్టడిస్తామని ప్రకటించారు. వారికి భూకబ్జాలు, అటవీభూముల ఆక్రమణ, ఎర్రచందనం స్మగ్లింగే ముఖ్యమైందన్నారు. అసెంబ్లీకి వెళ్లకుండా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అవమానిస్తూ, రాజారెడ్డి రాజ్యాంగాన్ని అనుసరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నారాయణ, వీర మహిళలు శోభ, సునీత, నగీనా, వసీం, లక్ష్మీపతి, మనోజ్, చిరంజీవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన చేయాల్సిందే

- బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బీసీ కుల జనగణన చేయాల్సిందేనని బీసీ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచందు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడిన వర్గాల ప్రజలకు జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం ఇవ్వడం లేదన్నారు. బీసీల సంఖ్యాబలాన్ని లెక్కపెట్టకుండా తక్కువ అవకాశాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మైనార్టీ నాయకుడు, సామాజిక కార్యకర్త సమీ మాట్లాడుతూ బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించి ప్రధానికి బీసీల పట్ల నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీమోహన్ యాదవ్ మాట్లాడుతూ దేశంలో జంతువులకు కూడా లెక్కలున్నాయని, బీసీలకు మాత్రం ఎలాంటి లెక్కలు లేవని ఆవేదన చెందారు. బీసీ కులాలన్నీ ఐక్యత చాటితే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ దేశంలో అన్ని కులాల గణన చేసి ఆవంతున అన్ని రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ దేశంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మీనాకుమారి, జబ్బల శ్రీనివాసులు, దద్దురెడ్డిబాబు, సీపీఐ సాంబశివ, సీపీఎం శ్రీనివాసులు, బీజేపీ బండి ఆనంద, టీడీపీ రెడ్డిప్రసాద్, వాల్మీకి సంఘం పులి శ్రీనివాసులు, రజక సంఘం రామమూర్తి, చేనేత సంఘం నాగరాజ, వీరభాస్కర, బహుజన సేన నాయకులు మనోహర్‌రెడ్డి, రూపక్‌నాయక్, రెడ్డిభాను, రాఘవేంద్ర, హరిబాబు. సయ్యద్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి పెయింటర్ మృతి చెందినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు గాలివీడు మండలం శెట్టివారిపల్లెకు చెందిన సుబ్బయ్య, యశోదల కుమారుడు నాగరాజు (34) పెయింటర్‌గా బెంగళూరు, మదనపల్లెలో పని చేస్తుండేవాడని, మూడు రోజుల క్రితం ఇంటికి వస్తున్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడన్నారు. ఇంటికి రాకపోవడంతో తల్లి యశోద తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మదనపల్లె మండలం బసినికొండ వద్ద నక్కలకుంట చెరువులో శవమై తేలాడు. ఆదివారం స్థానికులు గుర్తించి తాలుకా పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి శవ పరీక్షల కోసం తరలించారు. మృతుని తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

'మసీదుకు సంబంధం లేదు'



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బాధితులు

మదనపల్లె, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కదిరిరోడ్డులోని భూమి మసీదుకు సంబంధం లేదని బాధితులు శంకర్‌రెడ్డి, బీద షరీఫ్, అల్లాహ్ భక్ష్, తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ టిప్పుసుల్తాన్ కాలంనాటి దాదాపు 40 ఎకరాల స్థలాన్ని ఆక్రమించారని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాపై ఆరోపణలు చేశారు. అందులో రూములు కట్టించి ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చినట్లు బాధితులు పేర్కొన్నారు.

అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లె, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): టిప్పుసుల్తాన్ వక్ఫ్ భూముల్లో అక్రమంగా ప్రవేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని జామియా మసీదు కేర్‌టేకర్ కమిటీ అధ్యక్షుడు సర్దార్, న్యాయవాది నాయబ్ సికిందర్ అలీఖాన్, తదితరులు డీఎస్పీ కొండయ్యనాయకుడు ఫిర్యాదు చేశారు. ముస్లింలు, జమాత్ పెద్దలకు, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూములన్నీ వక్ఫ్‌కు సంబంధించినవని, దీనిపై సర్వహక్కులు జామియా మసీదుకు చెందుతాయని 2005లోనే స్థానిక న్యాయస్థానం తీర్పు ఇచ్చిందన్నారు. అయినా కొందరు తప్పుడు తప్పుడు ప్రచారం చేస్తూ, సమాజంలో అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. డీఎస్పీని కలిసిన వారిలో అక్బర్‌బాషా, ఖాజాహుస్సేన్, అహ్మద్‌బాషా, షఫీర్, ఇంతియాజ్, జలాల్‌సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న జామియా మసీదు జామియా మసీదు కమిటీ సభ్యులు

ఇరువర్గాల దాడి కేసులో పదిమందికి రిమాండ్



నిందితులను చూపిస్తున్న పోలీసులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీలోని రెండుగ్రామాల వ్యక్తులు పుంగనూరు రోడ్డు జూస్ ఫ్యాక్టరీ సమీపంలో మరణాయుధాలతో దాడి ఘటనపై ఆదివారం 10మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కళావెంకటరమణ తెలిపారు. వారి వద్ద నుంచి కర్రలు, కొడవళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో అరవవాండ్లపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు పూలగణేష్(24), వెంకటస్వామి కుమారుడు పూల నారాయణస్వామి(44), నారాయణస్వామి కుమారుడు పూల సందీప్ (21), నరసింహులు కుమారుడు పూల శివరాజ్(30)లను, ఇదే సంఘటనలో కృష్ణాపురానికి చెందిన ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఇందులో చిన్నరెడ్డెప్ప కుమారులు హరి (34), సురేష్ (37), వెంకటరమణ కుమారుడు సాయికళ్యాణ్(28),చలపతి కుమారుడు రెడ్డిప్రసాద్(21), వెంకటేశ్ కుమారుడు నవీన్(24), మునిరత్నం కుమారుడు పవన్‌కుమార్(24) ఉన్నట్లు తెలిపారు.

దౌర్జన్యంగా చెట్లు పెకిళించిన వారిపై చర్యలు తీసుకోవాలి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం జాండ్ల పంచాయతీ బసిరెడ్డిగారిపల్లె మాదిగపల్లెలో రాత్రికి రాత్రి దౌర్జన్యంగా చెట్లు పెకిళించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బసిరెడ్డిగారిపల్లె మాదిగపల్లెలోని మాదిగలు నాటుకున్న కొబ్బరి చెట్లను అదే గ్రామానికి చెందిన సిద్దారెడ్డి శనివారం రాత్రి దౌర్జన్యంగా పెకిళించేశాడని, అడ్డుపడిన గ్రామస్తులపై దౌర్జన్యం చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ ఆరోపించారు. ఆదివారం ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండికోట వెంకటేశ్, సీనియర్ నాయకుడు వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు వీరభద్రాద్రిపై నంది విగ్రహ ప్రతిష్ఠ

- మూడు రోజులపాటు ఉత్సవాలు
- శివరాత్రికి ముస్తాబు



కొండపైకి నంది విగ్రహం తీసుకెళ్తున్న దృశ్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని వీరభద్రాద్రి (వీరన్నకొండ)పై ఈ ఏడాది శివరాత్రి పండుగ ఉత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం కొండపై తొలి రోజు మహానందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠతో వేడుకలు మొదలు కానున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నంది విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి కొండపైకి చేర్చారు. విగ్రహ ప్రతిష్ఠతో మొదలై మూడు రోజుల పాటు హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. శివరాత్రి రోజున కొండపై భక్తుల జాగరణ, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాట్లు చేశారు. అలాగే పట్టణ పడమర పొలిమేరల్లో ధర్మపథం, కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి దేవాలయం, ఏటిగడ్డ శివాలయం, మండలంలోని చింతపర్తి గ్రామం ఓబులేశ్వరస్వామి ఆలయాలలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరగనున్నాయి.

కరాటే మాస్టర్ సురేశ్‌కు టీడీపీ నాయకుల నివాళి



సురేశ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కరాటే మాస్టర్, జర్నలిస్టు ఏఆర్ సురేశ్ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సురేశ్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు సురేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. జర్నలిస్టుగా, కరాటే మాస్టర్‌గా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు తదితరులు వున్నారు.